

అన్ని రైళ్లనూ ఆపాలి

భువనగిరిలో అన్ని రైళ్లను ఆపాలని సాక్షి నిర్వహించిన పీపుల్స్ ఎజెండాలో ప్రయాణికులు అభిప్రాయ పడ్డారు. - 8లో



అప్పుల్లో సిరిపురం సొసైటీ

వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించిన సిరిపురం చేనేత సొసైటీ అప్పుల్లో కూరుకుపోయింది. - 9లో

గరిష్టం / కనిష్టం

41° / 26°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శివాలయంలో సంప్రదాయ పూజలు



స్ఫటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయంలో సుప్రభాత సేవ చేపట్టి స్వామి, అమ్మవారికి అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో నిత్యకల్యాణం, శ్రీ సుదర్శన నారసింహహోమం తదితర కైంకర్యాలు గావించారు.సాయంత్రం ఉత్సవమూర్తుల జోడు సేవలను ఆలయ మాడవీధిలో ఊరేగించారు. వివిధ విభాగాల ద్వారా రూ. 27,13456 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అదే విధంగా నారసింహుడి అనుబంధ ఆలయమైన శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రం రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తవద్దు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ

యాదగిరిగుట్ట రూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా చూడాలని జిల్లా వ్యవసాయాధికారి అనురాధ సూచించారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి, సాదువెల్లి గ్రామాల్లోని కేంద్రాలను సోమవారం ఆమె సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు, రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్ల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లలో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆమె వెంట వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకట్‌రావు, ప్రణయరెడ్డి ఉన్నారు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి



ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వాహనాన్ని తనిఖీ చేస్తున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

బొమ్మలరామారం : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని డీసీపీ రాజేశ్‌చంద్ర సూచించారు. సోమవారం ఆయన బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అక్రమ మద్యం, నగదు తరలించకుండా నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో వలంటీర్లను సమన్వయ పరుస్తూ పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక గుడిబావి చౌరస్తా వద్ద ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలసి వాహనాలను తనిఖీ చేశారు.

రైస్ మిల్లులో సోదాలు ?

సాక్షి, యాదాద్రి : భువనగిరి పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో సోమవారం సివిల్ సప్‌లై పౌరసరఫరాల అధికారులు సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వలపై విచారణ చేసినట్లు సమాచారం. 50వేల నుంచి లక్షల బస్తాల ధాన్యం వరకు స్టాక్ లేదని సూర్యాపేట జిల్లాలోని ఓ మిల్లర్ చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అధికారులు ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో మిల్లులో తనిఖీలు నిర్వహించగా ధాన్యం నిల్వల్లో తేడాలు గుర్తించినట్లు సమాచారం. ఈ విషయమై సివిల్ సప్‌లై డీఎం గోపికృష్ణను వివరణ కోరగా.. కొనుగోలు కేంద్రాల నుంచి లారీల్లో మిల్లుకు వచ్చిన ధాన్యం దిగుమతి కాలేదని, తాము వచ్చి దిగుమతి చేయించినట్లు తెలిపారు. మిల్లు వద్ద 34 లారీల్లో ధాన్యం అన్‌లోడ్ కాకుండా ఉండడంతో వచ్చామని, ఎలాంటి తనిఖీలు చేయలేదన్నారు.

బరిలో 39 మంది

భువనగిరి లోక్‌సభ స్థానానికి రికార్డు స్థాయిలో అభ్యర్థులు

- నోటాతో 40 గుర్తులు
- మూడు బ్యాలెట్ యూనిట్లతో పోలింగ్
- 12 మంది నామినేషన్ల ఉపసంహరణ

సాక్షి, యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం సోమవారం ముగిసింది. పరిశీలన తర్వాత 51 నామినేషన్లకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. ఇందులో 12 మంది నామినేషన్లు ఉపసంహరించుకోగా 39 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. నోటాతో కలిపి 40 గుర్తులు బ్యాలెట్ యూనిట్లలో ఉండనున్నాయి. పోటీలో ఉన్నవారికి ఎన్నికల కమిషన్ గుర్తులు కేటాయించింది. గుర్తుల కేటాయింపులో తొలుత జాతీయ పార్టీలకు ప్రాధాన్యమిచ్చింది.

ఈసారి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు

భువనగిరి లోక్‌సభ స్థానానికి ఈసారి రికార్డు స్థాయిలో అభ్యర్థులు బరిలో నిలిచారు. మొత్తం 61 మంది నామినేషన్లు దాఖలు చేయగా స్క్రూట్నీలో పది తిరస్కరణకు గురయ్యాయి. 12 మంది ఉపసంహరించుకున్నారు. చివరికి 39 మంది బరిలో మిగిలినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. కాగా 2009లో జరిగిన ఎన్నికల్లో 15 మంది, 2014లో 13 మంది, 2019లో 13 మంది పోటీ చేశారు. ప్రస్తుతం బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, సీపీఎంతో పాటు పలు చిన్నపార్టీలు, స్వంతంత్రులు బరిలో మిగిలారు.

ఆశించిన స్థాయిలో ఫలించని ఉపసంహరణ ప్రయత్నాలు

పలువురు అభ్యర్థులను ఉపసంహరింపజేసేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు చేసిన ప్రయత్నం ఆశించిన విధంగా ఫలితం ఇవ్వలేదు. గత ఎన్నికల్లో 13 మంది బరిలో నిలిచారు. ఈసారి 39 మంది పోటీలో ఉన్నారు. 15 మంది అభ్యర్థులు దాటితే రెండో బ్యాలెట్ యూనిట్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. దీనివల్ల ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉంటుంది. తమకు వచ్చే ఓటు ఇతరులకు పడే అవకాశం ఉంటుందని, తద్వారా తమకు నష్టం



నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలిస్తున్న పరిశీలకులు, రిటర్నింగ్ అధికారి

కలుగుతుందన్న ఆందోళన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో నెలకొనడంతో వారు అప్రమత్తం అయ్యారు. చిన్నపార్టీల అభ్యర్థులను, ఇండిపెండెంట్లను ఉపసంహరింపజేసేందుకు శతవిధాలా ప్రయత్నం చేశారు. ఉపసంహరించుకున్న అభ్యర్థులకు పారితోషికం ముట్టజెప్పినట్లు తెలుస్తోంది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

అదనంగా 566 బ్యాలెట్ యూనిట్లు అవసరం

భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. ఆయా నియోజకవర్గాల్లో 2,141 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి పోలింగ్ బూత్‌కు అదనంగా 20 శాతం బ్యాలెట్ యూనిట్లు కావల్సి ఉంటుంది. ఈ లెక్కన మొత్తం 1,698 బ్యాలెట్ యూనిట్లు అవసరం అవుతాయి. ప్రస్తుతం 1,132 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు, నోటాతో కలిపి 40 గుర్తులు ఉండనున్నాయి. ఈ క్రమంలో అదనంగా మరో 566 బ్యాలెట్ యూనిట్లు అవసరం కానున్నాయి. ఈమేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు కే.జెండగే.. బ్యాలెట్ యూనిట్ల కోసం ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. అభ్యర్థులకు కేటాయించిన గుర్తుల అధారంగా బ్యాలెట్ పేపర్‌ను రూపొందించనున్నారు.

రోడ్డు రోలర్ కోసం ముగ్గురు పోటీ

స్వతంత్రులకు కేటాయించే గుర్తుల్లో ఒకటైన రోడ్డు రోలర్ గుర్తు కోసం ముగ్గురు అభ్యర్థులు పోటీ పడ్డారు. పూస శ్రీనివాస్, రచ్చ సుభద్రారెడ్డి, భిక్షపతి తమకు రోడ్డు రోలర్ గుర్తు కేటాయించాలని కోరారు. కాగా కారును పోలిన రోడ్డు రోలర్ గుర్తుకు గత లోక్‌సభ ఎన్నికల్లో 20 వేల వరకు ఓట్లు రావడంతో ఫలితం తారుమారైన విషయం తెలిసిందే.

నల్లగొండ నుంచి 22 మంది..

నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ బరిలో 22 మంది అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 56 మంది అభ్యర్థులు 114 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలనలో సరైన వివరాలు లేని 25 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 31 మంది నామినేషన్లు ఆమోదం పొందగా.. వారిలో 9 మంది ఉపసంహరించుకున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. ఓటర్ల అనుబంధ జాబితాను కూడా ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ జాబితా ప్రకారమే ఎన్నికలు జరగనున్నాయి.

రెండు బ్యాలెట్ యూనిట్లు

లోక్‌సభ నియోజకవర్గానికి 22 మంది అభ్యర్థులు పోటీలో ఉండటంతో ఒక్కో ఈవీఎంకు 2 బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి వస్తుంది. ఒక్కో బ్యాలెట్ యూనిట్‌లో 16 గుర్తులు మాత్రమే ఉంటాయి. అయితే నల్లగొండ పార్లమెంట్‌కు 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రంలో రెండు బ్యాలెట్ యూనిట్లను వాడాల్సి ఉంటుంది. మొదటి బ్యాలెట్ యూనిట్లో వరుసగా 16మంది అభ్యర్థుల పేర్లు, గుర్తులు ఉంటాయి. దానికి అనుబంధంగానే రెండో బ్యాలెట్ యూనిట్ కూడా ఉంటుంది. అందులో మిగతా ఆరుగురి పేర్లు, గుర్తులతో పాటు ఏడో నెంబర్‌గా నోటా ఉంటుంది.



భువనగిరిలోని న్యూ డైమెన్షన్ స్కూల్‌లో నిర్వహించిన టెన్నిస్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు

భువనగిరి : పట్టణంలోని న్యూ డైమెన్షన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో మే 1నుంచి 4వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి టెన్నిస్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. మంగళవారం కూడా ఎంపిక పోటీలు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి సుమారు 145 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. అంతకుముందు పోటీలను జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు దిడ్డి బాలాజీ ప్రారంభించారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి, ఖలీల్, పాండు, వినోద్, పరమేష్, అన్వితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు చేసిన ప్రతి పైసా లెక్క చూపాలి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఖర్చు వివరాలను ప్రతి పైసా తప్పనిసరిగా నమోదు చేయాలని భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాబర్ట్‌సింగ్ క్షేత్రమయుమ్, వ్యయ పరిశీలకులు రాకేశ్‌కుమార్ రంజన్, సాయన్ దేబర్మ సమక్షంలో అభ్యర్థులు, వారి ప్రతినిధులకు ఎన్నికల వ్యయంపై అవగాహన కల్పించారు. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును ఏరోజుకారోజు మూడు రిజిస్టర్లలో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే లోపు మూడు దఫాలు తమ ఎన్నికల వ్యయం నివేదికను అభ్యర్థి లేదా తన ప్రతినిధి ద్వారా ఎన్నికల అధికారులకు అందజేయాలన్నారు. అందజేయని పక్షంలో 1951 యాక్ట్ సెక్షన్ 10–అ కింద మూడు సంవత్సరాల పాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హత కోల్పోతారని తెలిపారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి అభ్యర్థి రూ.95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని, ఎన్నికలు ముగిసిన తర్వాత రిటర్నింగ్ అధికారి వద్ద ఫైనల్ రీకన్సిలేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ర్యాలీలు, సమావేశాలు, సభలకు సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతి పొందవచ్చన్నారు. తేదీ సమయం స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి తూచ తప్పక పాటించాలని, ప్రచారం నిర్దేశిత సమయంలోపు ముగించాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళి ఉల్లంఘించకుండా ప్రత్యేక బృందాల నిఘా ఉంటుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బెన్‌షాలోమ్, గంగాధర్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఓర్వలేకనే కాంగ్రెస్ దుష్ప్రచారం

- ఎన్నికల్లో గుణపాఠం తప్పదు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

తుర్కపల్లి : కేంద్రంలో, భువనగిరి లోక్‌సభ స్థానంలో బీజేపీ గెలుపు ఖరారైందని, తమకు లభిస్తున్న ప్రజాధరణ చూసి ఓర్వలేకనే కాంగ్రెస్ నాయకులు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం తుర్కపల్లిలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి 40 సీట్లు కూడా రావని తప్పుడు ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఎన్నికల్లో గుణపాఠం తప్పదనిన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీజేపీ.. రాజ్యాంగాన్ని బలోపేతం చేసిందని, గిరిజన మహిళను దేశ ప్రథమ పౌరురాలిగా చేసిందని, ఎంతోమంది ఎస్టీ, ఎస్సీలను మంత్రులుగా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. తన ఎంట్రీతో భువనగిరిలో ఒక్కసారిగా మార్పు వచ్చిందని, ఇది చూసి కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక పోతున్నారని బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ రాజకీయంగా బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిచి



తుర్కపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

భువనగిరికి చేసిందేమీ లేదని విమర్శించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేశానని చెప్పారు. సకల జనులకు అండ బీజేపీ జెండా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు యాట పెంటయ్య, ప్రధాన కార్యదర్శి ఉట్కూరి అశోక్ గౌడ్, ఆలేరు అసెంబ్లీ కన్వీనర్ చిరిగే శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి మేకల శ్రీనివాస్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు శత్రునాయక్, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నరేందర్‌నాయక్ , యువ మోర్చా మండల అధ్యక్షుడు భాస్కర్ నాయక్, పార్లమెంటు ప్రభారి పాపారావు, నాయకులు కొక్కొండ లక్ష్మీనారాయణ గౌడ్, వేముల నరేష్ మేకల లావణ్య గోనే స్వరూప పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

భువనగిరి రూరల్ : మండలంలోని వడపర్తి, హన్మాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం ఉపాధిహామీ పథకం ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రత్యేకాధికారి ఉష పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీరు, నీడ సౌకర్యం కల్పించడంతో పాటు మెడికల్ కిట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు.

బీజేపీకి ఇన్‌చార్జ్‌లొచ్చారు

- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నియామకం

భువనగిరి : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భువనగిరి ఎంపీ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు బీజేపీ కర్ణాటక రాష్ట్రానికి చెందిన పలువురిని ఇన్‌చార్జ్‌లుగా నియమించింది. ఆలేరు, జనగామకు ఉదయ్‌కుమార్, నకిరేకల్, తుంగతుర్తికి దేవయ్య, ఇబ్రహీంపట్నం, మునుగోడుకు వికాష్‌ను నియమించారు. వీరంతా సోమవారం భువనగిరిలోని బీజేపీ కార్యాలయానికి చేరుకున్నారు. వీరికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు.



ఇన్‌చార్జ్‌లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, పార్లమెంట్ ప్రభారి పాపారావు, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు నల్లమాస రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను అడ్డుకుందాం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్ : రాజ్యాంగాన్ని మార్చాలని, చతుర్వర్ణ వ్యవస్థ పాలన తీసుకరావాలని బీజేపీ ప్రయత్నిస్తుందని, ఆ పార్టీ విధానాలను అడ్డుకుందామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ అప్రజాస్వామిక పాలన సాగిస్తున్నారని, 400 సీట్లు తమయేనంటూ ప్రజలతో మైండ్‌గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. దేశానికి ముప్పు వాటిల్లే విధానాలు అవలంభిస్తున్న మోదీ పాలనకు కాలం చెల్లే పరిస్థితులు దాపురించాయన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునే కర్తవ్యం దేశ ప్రజలేదనన్నారు. కేంద్ర ప్రభుత్వ, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడేది కమ్యూనిస్టు పార్టీ లేనని తెలిపారు.



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఓట్ల కోసం కుల రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. మేధావులు, ప్రజాతంత్రవాదులు, వామపక్షవాదులంతా సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ అభ్యర్థిత్వాన్ని బలపరిచి ఓట్లు వేయించే విధంగా కృషి చేయాలని కోరారు. మిగిలిన స్థానాల్లో ఇండియా కూటమి భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటేష్, కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోతున్న చేనేత వస్త్రాలు

- తీసుకునేందుకు ముందుకు రాని టెస్కో
- ఏడాదికాలంగా నిలిచిపోయిన కొనుగోళ్లు
- గతంలో కొనుగోలు చేసిన వస్త్రాలకూ అందని బిల్లులు
- నష్టాల్లో చేనేత సహకార సంఘాలు
- కార్మికులకు ఉపాధి కరువు

రామన్నపేట : చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయింది. కార్మికులు తయారు చేసిన వస్త్రాలను ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాల్సిన టెస్కో.. ఏడాది కాలంగా ముందుకు రావడం లేదు. దీంతో చేనేత సహకార సంఘాల్లో వస్త్ర నిల్వలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. గతంలో కొనుగోలు చేసిన వస్త్రాలకూ బిల్లులు చెల్లించకపోవడంతో చేనేత సహకార సొసైటీలు ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చేనేత వస్త్రాల ఉత్పత్తికి ప్రసిద్ధి. ఇక్కడ ఉత్పత్తి అయ్యే పట్టుచీరలు, మెర్స్‌రైజ్‌డ్ చీరలు, బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి. కార్మికులు తయారు చేసిన వస్త్రాలను చేనేత సహకార సంఘాలకు అందజేస్తారు. చేనేత సొసైటీలు టెస్కో ద్వారా విక్రయించి కార్మికులకు డబ్బులు చెల్లిస్తాయి.

44 సంఘాలు, 10వేలకు పైగా సభ్యులు

జిల్లాలో 44 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘాల్లో పది వేల మందికి పైగా సభ్యులు ఉన్నారు. సహకారేతర రంగంలో మరో పది వేల మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. మొత్తం ఎనిమిది వేల మంది కార్మికులు జియో ట్యాగ్ కలిగి ఉన్నారు. ఒక్క జియోట్యాగ్ ఒక వీవర్, ఇద్దరు



రామన్నపేట మండలంలోని సిరిపురం చేనేత సహకార సంఘంలో వస్త్ర నిల్వలు

అనుబంధ కార్మికులకు వర్తిస్తుంది.

రూ.10కోట్లకు పైగా విలువ చేసే వస్త్ర నిల్వలు

జిల్లాలోని వివిధ చేనేత సహకార సంఘాల్లో రూ.10 కోట్లకు పైగా విలువ చేసే వస్త్ర నిల్వలు పేరుకుపోయాయి. భూదాన్‌పోచంపల్లి సొసైటీలో రూ.3 కోట్లు, కొయ్యలగూడెంలో రూ.50 కోట్లు, చౌటుప్పల్‌లో రూ.60 లక్షలు, సిరిపురంలో రూ.50 లక్షలు, గుండాలలో రూ.10లక్షలకు పైగా విలువైన వస్త్ర నిల్వలు ఉన్నాయి. గతంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి టెస్కో వారు వస్త్రాలను కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించే వారు. సంవత్సర కాలంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోయాయి. గత నవంబర్‌లో హైటెక్ సిటీలో చేనేత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఆ సందర్భంలో టెస్కో నామమాత్రంగా వస్త్రాలు కొనుగోలు చేసినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు చెల్లించలేదు. వస్త్రాలు కొనుగోలు చేయాలని టెస్కో అధికారులను చేనేత సహకార సంఘాల నిర్వాహకులు ఇటీవల కోరారు. అయితే బిల్లుల కోసం 8 నెలల వరకు ఆగుతామని రాతపూర్వకంగా రాసి ఇవ్వాలని టెస్కో షరతులు విధించిందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వం ఆదుకోవాలి



జిల్లా వ్యాప్తంగా చేనేత సహకార సంఘాల్లో పెద్ద ఎత్తున వస్త్ర నిలవ్వలు పేరుకుపోయాయి. టెస్కో వస్త్రాలు కొనుగోలు చేసి సంఘాలను ఆదుకోవాలి. గత నవంబర్‌లో కొనుగోలు చేసిన వస్త్రాల బిల్లులు కూడా విడుదల చేయాలి. అప్పుల్లో కూరుకుపోయిన చేనేత సంఘాల క్యాష్‌క్రెడిట్ రుణాలను ప్రభుత్వం మాఫీ చేసి ఆదుకోవాలి. పావలా వడ్డీ, జీఎస్టీ రిటరన్స్ బాపతు డబ్బులు విడుదల చేయాలి.

–కందగట్ల భిక్షపతి, చేనేత సహకార సంఘాల అసోషియేషన్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

భారంగా సొసైటీల నిర్వహణ

ఏడాదికాలంగా వస్త్రాలను కొనుగోలు చేయక పోవడం, కొనుగోలు చేసిన వాటికి బిల్లుల రాకపోవడంతో సొసైటీల నిర్వహణ భారంగా మారింది. నిర్వహణ, ఇతర అవసరాలకు చేసిన అప్పులపై చెల్లించిన వడ్డీల రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన పావలావడ్డీ డబ్బులు, రెండు శాతం జీఎస్టీ తిరిగి సంఘాలకు రావాల్సి ఉంది. అవి రాకపోవడంతో కార్మికుల(సభ్యులు) నుంచి తీసుకున్న వస్త్రాలకు సంబంధించిన బిల్లులు చెల్లించడానికి అధిక వడ్డీలకు ప్రైవేట్ అప్పులు చేయాల్సి వస్తుందని సొసైటీల బాధ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

ప్రచారంలో ఇంటి భోజనం



రామన్నపేట : భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ తన నిరాడం బరతను చాటు కుంటున్నాడు. ప్రచార సమయంలో ఎవరికి భారం కాకూడదని ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తిన్నారు. అనంతరం ప్రచారంలో సాగిపోయారు.

ఖర్చుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

నల్లగొండ : అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలను అధికారులు సక్రమంగా నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకుడు కళ్యాణ్‌కుమార్ దాస్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఆయా పార్టీలు ఖర్చు చేసిన వివరాలు, ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాల్లో వస్తున్న ప్రకటనల ఖర్చును అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌కు ముందు అభ్యర్థులు, పార్టీలు చేసిన ఖర్చు వివరాలను సంబంధిత ఖాతాలో పొందుపరిచామని, నామినేషన్ తర్వాత అభ్యర్థి ఖాతాలో ఆ ఖర్చు వివరాలు నమోదు చేయనున్నట్లు నోడల్ అధికారులు వివరించారు. సమావేశంలో ఎక్స్‌పెండేచర్ నోడల్ ఆఫీసర్ కిరణ్‌కుమార్, జిల్లా ఆడిట్ అధికారి జి.శ్రీనివాస్, ఎక్సైజ్ నోడల్ ఆఫీసర్ సతీష్, మీడియా నోడల్ అధికారి కోటేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కళ్యాణ్‌కుమార్ దాస్

నల్లగొండ బరిలో వీరే..

అభ్యర్థి	పార్టీ
1. అంజయ్య విరిగినేని	బహుజన సమాజ్ పార్టీ
2. కంచర్ల కృష్ణారెడ్డి	భారత రాష్ట్ర సమితి
3. రఘువీర్‌రెడ్డి కుందూరు	కాంగ్రెస్
4. సైదిరెడ్డి శానంపూడి	భారతీయ జనతా పార్టీ
5. జానయ్య నందిపాటి	తెలంగాణ సకలజనుల పార్టీ
6. తలారి రాంబాబు	ధర్మసమాజ్ పార్టీ
7. రచ్చ సుభద్రారెడ్డి	సోషలిస్టు పార్టీ(ఇండియా)
8. వస్కుల మట్టయ్య	మార్కిస్టు కమ్యూనిస్టు ఆఫ్ ఇండియా(యునైటెడ్)
9. కిన్నెర యాదయ్య	స్వతంత్ర
10. కుందారపు శ్రీకాంత్	స్వతంత్ర
11. కుక్కల వెంకన్న	స్వతంత్ర
12. గోలి సైదులు	స్వతంత్ర
13. చొల్లేటి ప్రభాకర్	స్వతంత్ర
14. పానుగోతు లాలసింగ్	స్వతంత్ర
15. పాలిసెట్టి వెంకటేశ్వర్లు	స్వతంత్ర
16. నాగరాజు బండారు	స్వతంత్ర
17. మర్రి నెహెమ్యా	స్వతంత్ర
18. మారం వెంకటరెడ్డి	స్వతంత్ర
19. రమేష్ సుంకరి	స్వతంత్ర
20. రవి పాలకూరి	స్వతంత్ర
21. లింగం కృష్ణ	స్వతంత్ర
22. సిరికాల శ్రీనయ్య	స్వతంత్ర

భువనగిరిలో..

1. చామల కిరణ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్
2. క్యామ మల్లేష్	బీఆర్‌ఎస్
3. డాక్టర్ నర్సయ్య బూర	బీజేపీ
4. ఎండీ. జహంగీర్	సీపీఎం
5. ఐతరాజు అంబేద్కర్	బీఎస్‌పీ
6. ఏమిరెడ్డి రవికిరణ్‌రెడ్డి	స్వతంత్ర
7. అనిల్‌కుమార్	స్వతంత్ర
8. భావబోయిన లక్ష్మయ్య	స్వతంత్ర
9. బొల్లారం బాలరాజు	స్వతంత్ర
10. ధరావత్ గోపినాయక్	స్వతంత్ర
11. ఎర్ర సూర్యం	విదుతలై చిరుతైగల్ కచ్చి
12. జంగన సుజాత	స్వతంత్ర
13. కె.కిరణ్‌కుమార్	బహుజన రిపబ్లిక్ సోషలిస్టు పార్టీ
14. కందాడి మైపాల్‌రెడ్డి	తెలంగాణ రిపబ్లిక్ పార్టీ
15. కె.రామరాజు	స్వతంత్ర
16. కె.యాదగిరి	స్వతంత్ర
17. ఎన్.కర్ణాకర్‌రెడ్డి	జై భారత్ నేషనల్ పార్టీ
18. కె.లింగస్వామి	ధర్మసమాజ్ పార్టీ
19. కొంగరి మల్లేష్	స్వతంత్ర
20. కె.శ్రీనివాస్	నేషనల్ మహాసభ పార్టీ
21. ఎం.పరమేశ్	స్వతంత్ర
22. ఎం.చందు	స్వతంత్ర
23. ఎం.కృష్ణ	స్వతంత్ర
24. ఎం.గణేష్	పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా
25. జి.నరేందర్	స్వతంత్ర
26. వి.నరేంద్ర	జై స్వరాజ్ పార్టీ
27. ఎన్.స్వామి	స్వతంత్ర
28. ఎన్.వెంకటస్వామి	బహుజన లెఫ్ట్ పార్టీ
29. పి.రమేష్	బహుజన ముక్తి పార్టీ
30. పూస శ్రీనివాస్	టీఆర్‌పీపీ
31. పి.భక్షపతి	నేషనల్ నవక్రాంతి పార్టీ
32. సదానందరెడ్డి	పీపుల్ ప్రొటెక్షన్ పార్టీ
33. టి.మహేందర్	సోషల్ జస్టిస్ పార్టీ
34. మల్లేష్	స్వతంత్ర
35. వి.కృష్ణ	స్వతంత్ర
36. సుభద్రారెడ్డి	సోషలిస్టు పార్టీ
37. టి.రమేష్	ఏలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్ పార్టీ
38. జి.వెంకటయ్య	స్వతంత్ర
36. ఎల్.వెంకటేశ్వర్లు	ప్రజావాణి పార్టీ

అన్ని రైళ్లనూ ఆపాలి

- భువనగిరి రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలి
- అవసరాన్ని బట్టి అన్ని రైళ్లలో బోగీల సంఖ్య పెంచాలి

రైల్వే సమస్యలపై 'సాక్షి' పీపుల్స్ ఎజెండా



పీపుల్స్ ఎజెండాలో మాట్లాడుతున్న వివిధ వర్గాల ప్రజలు

పీపుల్స్ ఎజెండా

భువనగిరి : హైదరాబాద్–వరంగల్ రైల్వే మార్గంలో ఉన్న భువనగిరి స్టేషన్ మీదుగా అనేక రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ, ఇక్కడ మాత్రమ కొన్ని రైళ్లే ఆగుతున్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలో భువనగిరి, ఆలేరు, జనగాం ఉండగా జనగాం స్టేషన్‌లో నిలిపే రైళ్లు భువనగిరిలో ఆపడం లేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి రైళ్లలో భువనగిరికి వచ్చేవారు హైదరాబాద్ లేదా జనగాంలో దిగి ఇక్కడికి వస్తున్నారు. జిల్లాలో యాదాద్రి క్షేత్రం, భువనగిరి ఖిలా, కొలనుపాక వంటి పర్యాటక ప్రాంతాలు ఉండటంతో నిత్యం వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. కానీ, ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు మాత్రం ఇక్కడ ఆపడం లేదు. రాయగిరి వరకు ఎంఎంటీఎస్ మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదని వివిధ వర్గాల ప్రజలు అంటున్నారు. సోమవారం 'సాక్షి' ఆధ్వర్యంలో భువనగిరిలోని పెన్షనర్స్ భవనంలో 'రైల్వే సర్వీసులు–ప్రయాణికుల ఇబ్బందులు' అనే పీపుల్స్ ఎజెండాపై నిర్వహించిన సదస్సు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రైలు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించే వారికే ఈసారి ఓటు వేసేస్తామని అంటున్నారు. వారి అభిప్రాయాలు ఇలా ఉన్నాయి...

స్లీపర్ కోచ్‌లు తక్కువ చేసి ఏసీ కోచ్‌లను పెంచుతున్నారు



హైదరాబాద్–వరంగల్ రైలు మార్గంలో నడిచే రైళ్లలో స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఏసీ కోచ్‌లను పెంచుతున్నారు. దీనివల్ల సామాన్యులు ఎక్కువ సంఖ్యలో రైళ్లలో ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. వెంటనే స్లీపర్ కోచ్‌లను పెంచాలి. తిరుపతి, శబరి రైళ్లనూ ఆపాలి.

– పడకంటి సందీప్, ప్రయాణికుడు, భువనగిరి

క్యాంటిన్ ఏర్పాటు చేయాలి



భువనగిరి రైల్వే స్టేషన్‌లో క్యాంటిన్ ఏర్పాటు చేయాలి. సీనియర్ సిటిజన్స్‌కు రైలులో ప్రయాణించేందుకు సబ్సిడీ ఇవ్వాలి. ఏపీ రాష్ట్రం నుంచి వచ్చేవారు భువనగిరిలో దిగేందుకు రైలు నిలిపే సౌకర్యం కల్పించాలి. బీబీనగర్‌లో కూడా ఎక్స్‌ప్రెస్ రైల్లు ఆపాలి.

– కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, రిటైర్డ్ అధికారి, భువనగిరి

జోనల్ మేనేజర్ సమావేశం ఏర్పాటు చేయాలి



నిబంధనల ప్రకారం ప్రతి జోన్ పరిధిలో మేనేజర్లు ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు ఏర్పాటు చేయాలి. సమావేశంలో ప్రయాణికుల సమస్యలు, మౌలిక వసతుల కల్పన వంటి వాటిపై చర్చించాలి. సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కార మార్గాలు చూపాలి.

– బట్టు రాంచంద్రయ్య, దళిత ఐక్య వేదిక నేత, భువనగిరి

ఎంఎంటీఎస్ పనులు త్వరగా పూర్తిచేయాలి



రాయగిరి వరకు ఎంఎంటీఎస్ రైలు మార్గం మంజూరైనా ఘట్కేసర్ వరకు పనులు చేశారు. అక్కడ నుంచి మిగతావి పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలి. త్వరితగతిని ఎంఎంటీఎస్ పనులు పూర్తి చేయాలి. భువనగిరిలో పద్మావతి రైలును ఆపాలి.

– శ్రీనివాస్‌గుప్తా, విద్యావంతుడు, భువనగిరి

జనరల్ బోగీల సంఖ్య పెంచాలి



హైదరాబాద్ నుంచి రాత్రి సమయంలో వచ్చే రైళ్లను భువనగిరిలో ఆపాలి. భువనగిరి రైల్వే స్టేషన్‌లో మూత్ర శాలలుసరిగా లేవు, వికలాంగులకు వీల్ చైర్లు ఇవ్వడం లేదు. స్టేషన్‌లో ఉన్న బ్రిడ్జిని అర్బన్ కాలనీ వరకు పెంచాలి. భువనగిరి మీదగా వెళ్తున్న రైళ్లకు జనరల్ బోగీలు పెంచాలి.

– కొత్త నర్సింహస్వామి, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు, భువనగిరి

రైల్వే స్టేషన్లలో వసతులు కరువు



భువనగిరి రైల్వే స్టేషన్లలో వసతులు సరిగా లేవు. స్టేషన్ ఆవరణం అపరిశుభ్రంగా ఉంటుంది. రైల్వే ప్రయాణికులు పెరుగుతున్నందున భువనగిరి రైల్వే స్టేషన్‌లో వసతులు కల్పించాలి. స్టేషన్ సమీపంలోని కాలనీలకు వెళ్లాలంటే గేటు సమస్యగా ఉంది. ఇక్కడ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలి.

– రేఖల ఆనంద్, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి, భువనగిరి

భువనగిరి స్టేషన్‌ను జంక్షన్‌గా మార్చాలి



భువనగిరి రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం 3,500 మంది ఉపాధి కోసం, 1,200 మంది విద్యార్థులు విద్య కోసం హైదరాబాద్‌కు వెళ్తుంటారు. అలాగే యాదాద్రి క్షేత్రానికి వేలాది మంది వస్తుంటారు. ఈ క్రమంలో భువనగిరి రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించి జంక్షన్ మార్చాలి.

– పగడాల జలంధర్‌రెడ్డి, విద్యావంతుడు, భువనగిరి

నగదు, మద్యం పట్టివేత

వలిగొండ : పార్లమెంట్ ఎన్నికలో నేపథ్యంలో మండల కేంద్రంలోని తొర్రూర్ చౌరస్తా వద్ద సోమవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మండలంలోని చిత్తాపురం గ్రామానికి చెందిన ఏనుగు నరేందర్‌రెడ్డి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2,80,000 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం మండలంలోని ఆరూర్ వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.5వేల విలువ గల మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు, నగదు ట్రెజరరీకి తరలించినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు.

రామన్నపేటలో రూ.2.50లక్షలు..

రామన్నపేట : ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును రామన్నపేట పోలీసులు పట్టుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల కేంద్రంలోని సిరిపురం చౌరస్తాలో స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మహేష్ అనే వ్యక్తి రామన్నపేట నుంచి వలిగొండ వైపు బైక్‌పై వెళ్తుండగా పోలీసులు నిలిపి తనిఖీ చేశారు. అతడి వద్ద రూ.2.50లక్షలు నగదు పట్టుబడినట్లు తెలిపారు. ఈ నగదును స్వాధీనం చేసుకొని నల్లగొండ డీటీఓలో జమ చేసినట్లు ఎస్‌ఐ మల్లయ్య తెలిపారు.

అందరికీ ఒకేసారి గుర్తులు కేటాయించాలి

భువనగిరి టౌన్: లోక్‌సభ బరిలో ఉన్న అభ్యర్థులందరికీ ఒకేసారి గుర్తులు, సీరియల్ నంబర్లు కేటాయించాలని స్వతంత్ర అభ్యర్థి వేముల నరేంద్రదాస్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం భువనగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ప్రధాన పార్టీలకు ముందస్తుగా సీరియల్ నంబర్లు కేటాయించడం 14ను ఉల్లంఘించినట్లు అవుతుందన్నారు. నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా కొందరికి గుర్తులు, సీరియల్ నంబర్లు బహిర్గత పరిచి మరికొందరికి చెప్పకపోవడం సరికాదన్నారు.

అక్రమ రవాణా అరికట్టేందుకే చెక్‌పోస్టులు



రోలెక్స్(డాగ్)తో తనిఖీ చేస్తున్న పోలీసులు

సూర్యాపేట : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డబ్బు, మద్యం, డ్రగ్స్ లాంటి అక్రమ రవాణాను నిరోధించేందుకు అంతరాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దుల వెంట ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రాహుల్‌హెగ్డే తెలిపారు. సోమవారం సూర్యాపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారి 65 హైదరాబాద్–విజయవాడ హైవే టేకుమట్ల వద్ద ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా సరిహద్దు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు ఆయన పరిశీలించి మాట్లాడారు. డ్రగ్స్ నివారణలో భాగంగా నార్కోటిక్ రోలెక్స్ (డాగ్)తో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రోలెక్స్ (డాగ్) నార్కోటిక్ డ్రగ్స్‌ను గుర్తించడంలో నైపుణ్యం కలిగిందన్నారు. గతంలో ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో ప్రతిభ చూపి నార్కోటిక్ విభాగంలో రోలెక్స్ బహుమతి సాధించిందన్నారు.

శాంతియుత ఎన్నికలకు సహకరించాలి



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, పక్కన కలెక్టర్ హరిచందన

నల్లగొండ: శాంతియుత ఎన్నికలకు సహకరించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు మనోజ్ కుమార్ మాణిక్ రావు సూర్యవంశీ కోరారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం సోమవారం ఆయన నల్ల గొండ లోక్‌సభ నియోజకవర్గం బరిలో ఉన్న అభ్యర్థులతో కలెక్టరేట్‌లో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించినట్లు మా దృష్టికి తెస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నల్లగొండ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మాట్లాడుతూ నల్లగొండ లోక్‌సభ స్థానానికి మొత్తం 22 మంది పోటీలో ఉండగా వారికి గుర్తులు కేటాయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వీహెచ్‌పీ నాయకులు



ఫిర్యాదు చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

భువనగిరి : భువనగిరిలో ఈ నెల 25న జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్.. హిందూ సంప్రదాయాలను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేశారని, ఆయన పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత సహ కార్యదర్శి తోట భానుప్రసాద్ భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంట విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి సుక్కల శ్రీశైలం, కోశాధికారి చామ రవీందర్, నాయకులు వేణు, మల్లికార్జున్, ప్రసాద్, మేకల భానుప్రసాద్, శ్రవణ్‌కుమార్, నవీన్, శ్రీనివాస్ ఉన్నారు.

● 'న్యాయ'మైన మద్దతు కోసం..



ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నల్లగొండ జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి తనకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

WANTED కోదాడలోని ప్రముఖ N.R.S. I.I.T & Medical Academy లో పనిచేయుటకు వివిధ సబ్జెక్టుల వారిగా అర్హత కలిగిన లెక్చరర్లు, రిసెప్షనిస్టు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, వార్డెన్‌లు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు కోదాడ పట్టణంలోని నలంద స్ట్రీట్‌లో గల కాలేజ్ కార్యాలయంలో తమ అర్హతల వివరాలతో సంప్రదించగలరు.
ఖాళీల వివరాలు : 1) : ఫిజిక్స్ (ఎంసెట్ బోధించుటకు) 2) కెమిస్ట్రీ (ఎంసెట్ బోధించుటకు) 3) ఫిజిక్స్ (జూనియర్ లెక్చరర్) 4) కెమిస్ట్రీ (జూనియర్ లెక్చరర్) 5) మ్యాథమెటిక్స్ (జూనియర్ లెక్చరర్) 6) బాయ్స్ హాస్టల్ వార్డెన్ 7) కంప్యూటర్ ఆపరేటర్ 8) రిసెప్షనిస్ట్
మరిన్ని వివరాలకు : 9515000346, 9515000347, 9515000348 నెంబర్లలో సంప్రదించగలరు.
NRS Junior College IIT & Medical Academy
Opp. Dr. Suryanarayana Gari Hospital, Nalanda Street, Kodad - 508 206

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

VILLAS FOR SALE
■ No.1 Gated Community Near D-Mart, Miryalaguda, Ready to Occupy 3BHK Luxury Villas. Club House, Swimming Pool. Must See Call: 08069045560 [H-804932]

Wanted
■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Ph: 8977639662 /8977639663 [H-799874]
■ Wanted Collection Executives, Team Leaders & Tele-Callers to work for Nationalised Banks with DRA Certification. 9177657494, 9348290349 [HA-2384]
■ శ్రీ లక్ష్మీ హోంకేర్: హైదరాబాదు నందు వృద్ధులకు, పేషెంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి/వంటపనికి స్త్రీ/పు కావలెను. జీతం: 17,000/- రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [G-1475]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185056]
■ Wanted Maths, Physics, Zoology and English faculty for Junior College in Nalgonda town. Contact : 8639327414,9247335365 [Y-798444]
■ పారుల్ యూనివర్సిటీ బ్రాండ్ ప్రమోషన్ కొరకు లేడీటెలికాలర్స్,వయస్సు: 21–27సం॥ కావలెను. సంప్ర: విద్యానగర్, తిరుమల గ్రాండ్ వెనుక, సూర్యాపేట. 72077 05785 [G-8362]
■ సమ్మర్ జాబ్స్: నల్గొండ జిల్లాలోని మా సంస్థలో జాబ్ చేయడానికి 39 స్త్రీ/పులు కావలెను. Q: 10th, ఇంటర్, డిగ్రీ(P/F), జీతం: 14వేలు+6వేలు DA+ఫ్రీ రూం, భోజనం. సెల్: 8519891505. [L-795771]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేర్వేరు చోట్ల ఏటీఎంలలో చోరీకి యత్నం

- గ్యాస్‌కట్టర్‌తో కట్ చేస్తుండగా ఎగిసిన నిప్పురవ్వలు
- గుడిబండలో కాలిబూడిదైన రూ.8.12లక్షల నగదు
- చౌటుప్పల్‌లో సైరన్ మోగడంతో పారిపోయిన దుండగులు



కోదాడరూరల్ : ఏటీఎంను పరిశీలిస్తున్న ఎస్‌ఐ అనిల్‌రెడ్డి

కోదాడరూరల్ : ఏటీఎంలో ఓ దుండగుడు చోరీకి యత్నించిన ఘటన ఆదివారం అర్ధరాత్రి మండల పరిధిలోని గుడిబండలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గల యూనియన్ బ్యాంక్ ఏటీఎంలోకి వెళ్లిన దుండగుడు సీసీ కెమెరాల్లో కనిపించకుండా వెంట తెచ్చుకున్న గ్యాస్‌కట్టర్‌తో సీసీ కెమెరాలను ధ్వంసం చేశాడు. అనంతరం నగదును తీసుకునేందుకు గ్యాస్‌కట్టర్‌తో ఏటీఎం మిషన్ కట్ చేస్తుండగా నిప్పురవ్వలు పడి మిషన్‌లో ఉన్న రూ.8.12లక్షల నగదు కాలిబూడిదయ్యాయి. ఈ సంఘటనపై బ్రాంచ్ మేనేజర్ రమావత్ నాగునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా ఈ సంఘటన శనివారం రాత్రి జరిగిందని, ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చినా సెలవు కావడంతో సోమవారం హైదరాబాద్ నుంచి టెక్నీషియన్ వచ్చి మిషన్ ఓపెన్ చేసిచూడగా నగదు కాలిపోయి ఉన్నట్లు తెలిపారు.

చౌటుప్పల్‌లోని ఇండియన్ బ్యాంక్ ఏటీఎంలో..

చౌటుప్పల్ : పట్టణంలోని ఓ ఏటీఎంలో ఆదివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. సైరన్ మోగడంతో పారిపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా, తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న ఇండియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు అర్ధరాత్రి దాటాక నలుగురు దుండగులు కారులో చేరుకుని పక్కన పార్క్ చేశారు. ఏటీఎంలో సెక్యూరిటీగార్డు లేకపోవడంతో కారులో నుంచి ఓ దుండగుడు దిగి ఏటీఎంలోకి వెళ్లాడు. మిషన్‌ను తెరిచే ప్రయత్నంలో అందులోని అలారం మోగింది. అదే అలారం హెడ్ ఆఫీస్‌కు సైతం అనుసంధానంగా ఉండడంతో అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. వారంతా అప్రమత్తమవుతున్న విషయం ఏటీఎంలోని పరికరాల ద్వారా దుండగుడికి వినిపించడంతో నిందితుడు వెంటనే భయటకు వచ్చి కారెక్కి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఏటీఎంలోని సీసీకెమెరాలు, స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐలు మైసుద్దీన్, యాదగిరి తెలిపారు.

పోచంపల్లిని సందర్శించిన ఎన్‌ఐఆర్డీ విద్యార్థుల బృందం



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : చేనేత పరిశ్రమ తీరుతెన్నులను పరిశీలించేందుకు హైదరాబాద్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్డీ)కి చెందిన 35మంది విద్యార్థుల బృందం సోమవారం పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా వారు చేనేత సహకార సంఘం, చేనేత గృహాలను సందర్శించి అక్కడ మగ్గాలపై తయారవుతున్న ఇక్కత్ వస్త్రాలు, చీరలతో పాటు నూలు వడకడం, చిటికి కట్టడం, డిజైనింగ్, రంగులద్దే ప్రక్రియలను పరిశీలించారు. పోచంపల్లి ఇక్కత్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న గుర్తింపు, ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎన్‌ఐఆర్డీ అధ్యాపకురాలు హైమావతి మాట్లాడారు. ఎన్‌ఐఆర్డీలో రూరల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన 35మంది విద్యార్థులు 'రూరల్ మార్కెట్స్ అండ్ రూరల్ మార్కెటింగ్' అనే కోర్సులో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చినట్లు తెలిపారు. వారి వెంట ప్రొఫెసర్ దేవిప్రియ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ మాధవ ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు మృతి

- నార్కట్‌పల్లి ఓసీటీఎల్ కంపెనీ సమీపంలో ఘటన



జానిమియా (ఫైల్)

నార్కట్‌పల్లి: కారు, బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లిలోని ఓసీటీఎల్ కంపెనీ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నార్కట్‌పల్లి సమీపంలోని యు సాయి ఫోర్‌జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడేనికి చెందిన ఎండీ.జానిమియా (40) విధుల్లో భాగంగా కంపెనీ నుంచి కామినేని వైద్య కళాశాలకు బైక్‌పై వస్తున్నాడు. అదే సమయంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వచ్చిన ఓ కారు ఓసీటీఎల్ కంపెనీ వద్దకు రాగానే జాని బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న జాని రోడ్డు పక్కనే ఉన్న చెట్లపొదల్లో పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ అంతిరెడ్డి తెలిపారు.

వివాహితపై యువకుడి లైంగికదాడి

చౌటుప్పల్ : వివాహితపై ఓ యువకుడు గంజాయి మత్తులో లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని స్వాములవారి లింగోటం గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన భార్యాభర్తలు బతుకుదెరువు కోసం గ్రామానికి వచ్చారు. వారు స్థానికంగా గల ఓ పరిశ్రమలో పనిచేస్తూ గ్రామంలోనే ఓ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో వివాహిత(20) ఆదివారం రాత్రి తాను అద్దెకు ఉంటున్న ఇంటి ఎదుట కూర్చొని సెల్‌ఫోన్ చూస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు(22) బలవంతంగా ఆమెను అక్కడి నుంచి ఎత్తుకెళ్లి సమీపంలో లైంగికదాడికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను బెదిరించి అక్కడి నుంచి పారిపోయాడు. ఘటన అనంతరం బాధితురాలు 100నంబర్‌కు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ క్రమంలో బాధితురాలు నిందితుడి ఇంటికి పోలీసులను తీసుకెళ్లింది. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. లైంగికదాడికి పాల్పడిన సమయంలో నిందితుడు గంజాయి సేవించినట్లు, పోలీసులు అదుపులోకి తీసుకున్న సమయంలో కూడా మత్తులోనే ఉన్నట్లు తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ మృతి

వలిగొండ : ట్రాక్టర్ బోల్తాపడి ఓ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అరూరు గ్రామసమీపంలో సోమవారం చోటు చేసుకుంది. తోటి కార్మికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన దేశపాక యాదగిరి(26) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు తోటి కార్మికులతో కలిసి ఆత్మకూర్(ఎం) మండలంలోని లింగరాజుపల్లిలో ఇంటి స్లాబ్ వేసే పనులకు ట్రాక్టర్‌లో వెళ్లాడు. ఇంటి స్లాబ్ పనులు ముగించుకుని యాదగిరి ట్రాక్టర్ నడుపుకుంటూ వస్తుండగా అరూరు సమీపంలోని పెట్రోల్ పంపు సమీపంలోకి రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ నడుతున్న యాదగిరికి తీవ్ర, తోటి కార్మికులకు స్వల్పగాయాలయ్యాయి. వీరిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదారాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.